సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం। 13। జనవరి। 2025



నేడు 'ప్రజా సమస్యల వేదిక' రద్దు

భోగి, సంక్రాంతి పండుగల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు.



టమాట కిలో రూ.15

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.4°/13.7°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

చిరుత సంచారంతో కలవరం



కొండపై చిరుత దృశ్యం

అగళి: కదిరేపల్లి – కరిదాసనపల్లి సమీపంలోని పెద్దబండలో చిరుత పులి సంచరిస్తోంది. ఆదివారం ఉదయం పెద్దబండ ప్రాంతంలో చిరుత పులి, రెండు పిల్లలు ఉండటం గమనించి కొందరు వీడియో తీశారు. తల్లి చిరుత ఎప్పుడు గ్రామంలోకి వస్తుందోనని ప్రజల్లో కలవరం మొదలైంది. వ్యవసాయ పనులకు, పశువుల, గొర్రెల మేత మేపడానికి వేళ్లే వారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గత సెప్టెంబర్ 9, 25 తేదీల్లో చిరుత పులి కరిదాసనపల్లికి ఉగ్రప్ప చెందిన గొర్రెలను లాక్కెళ్లి తినేసింది. అటవీ అధికారులకు తెలిపినా స్పందించటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

బాల్య వివాహం అడ్డగింత



గోరంట్ల: అజ్ఞాత వ్యక్తి సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు ఓ బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. ఓబుళదేవరచెరువు మండలం సున్నంపల్లికి చెందిన 26 ఏళ్ల అబ్బాయికి, వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం టీ వెలమవారిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల అమ్మాయికి గోరంట్ల మండలం గుమ్మయ్యగారిపల్లి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం వివాహానికి ఏర్పాట్లు చేశారు. మైనర్‌కు వివాహం జరుగుతోందని ఓ అజ్ఞాత వ్యక్తి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ వర్కర్ విజయమ్మ సదరు కల్యాణమండపం వద్దకు చేరుకున్నారు. వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. బాల్య వివాహం నిలుపుదల చేయించారు. మేజర్లు అయ్యే వరకు వివాహం చేయబోమని వారి చేత రాతమూలకంగా రాయించుకున్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు



పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు ఎస్పీ రత్న భోగి, మకర సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయతలు, అనుబంధాలు, తెలుగు సంప్రదాయాలకు సంక్రాంతి పత్రీక అని అభివర్ణించారు. భోగిమంటలు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పచ్చని పైరు గుర్తుకొస్తాయన్నారు. ప్రజల జీవితాల్లో భోగి పండుగ భాగ్యాలు తేవాలని, సంక్రాంతి నవకాంతిని నింపాలని, అన్నదాతల ఇళ్లు ధాన్యరాశులతో నిండాలని, సిరులు కురవాలని ఆకాంక్షించారు.

యువతే భావిభారత నిర్మాతలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: భావి భారత నిర్మాతలు యువతీ యువకులేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు సమీపంలోనున్న శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో సనాతన ధర్మాన్ని పరిచయం చేసిన వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆ మహనీయుడి స్ఫూర్తితో యువత రాణించేందుకు లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమి వారితో సివిల్స్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకుల కోసం 99 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్, బీజేపీ నాయకులు హరీష్‌బాబు, సందిరెడ్డి శ్రీనివాసులు, జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనారోగ్య సమస్యలతో వైద్యం చేయించుకున్న ఆరుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద మంజూరైన చెక్కులను మంత్రి సత్యకుమార్ బీజేపీ కార్యాలయంలో పంపిణీ చేశారు.

కళ తప్పిన పల్లెసీమ

- దీనావస్థలో బతుకులు
- దారుణంగా దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- ఆర్థిక చేయూత కరువై పల్లెల నిర్వేదం
- కనిపించని సంక్రాంతి వెలుగులు
- పిండి వంటలకూ వెనకాడుతున్న వైనం
- పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT



సంక్రాంతి పండుగ వేళ జనాలు లేక నిర్మానుష్యంగా కనిపిస్తున్న జగరాజుపల్లి మెయిన్ రోడ్

సాక్షి, పుట్టపర్తి బృందం: సంక్రాంతి.. పేరుకే పెద్ద పండుగ. కానీ ఆ వాతావరణమే లేదు. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులతో ధాన్యం ఇల్లు చేరలేదు. మార్కెట్లో ఏది కొనాలన్నా చుక్కలు కనిపిస్తున్నాయి. పండుగ నాడు పరమాన్నం కాదు.. పప్పన్నం తినడం కూడా భారంగా పరిణమించింది. 'సంక్రాంతి' సందర్భంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాజా పరిస్థితులపై 'సాక్షి' అధ్యయనం చేయాలని సంకల్పించింది. అందుకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లిని ఎంచుకుంది. పుట్టపర్తి నుంచి జగరాజుపల్లి వరకు సాగిన అధ్యయనంలో ప్రజలు పలు విధాలుగా స్పందించారు.

➠ శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద జనరల్ స్టోర్ నిర్వాహకుడు మనోహర్‌ను పండుగ వ్యాపారం ఎలా సాగుతోందని అడగగా సందడి లేదన్నాడు. సాధారణ రోజుల మాదిరిగానే వ్యాపారం జరుగుతోందని సమాధానం ఇచ్చాడు. కాస్త ముందుకెళ్లాక మామిళ్లకుంట క్రాస్ వద్ద 18వ వార్డుకు చెందిన లక్ష్మీదేవి, శాంతమ్మను పలకరిస్తే మునుపటిలా ఆడంబరాలు లేవని చెప్పారు. ఆర్థిక స్తోమత లేనందున కొద్ది పాటి పిండి వంటలతోనే సరిపెట్టుకుంటున్నామన్నారు. అటు నుంచి కప్పలబండ వద్ద ఎర్రబల్లికి చెందిన ఓబుళరెడ్డిని పలకరించగా.. ఎక్కడా పండుగ సందడి కనిపించలేదన్నాడు. ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడంతో షాపింగ్ చేయకుండా ఇంటికే పరిమితమైనట్లు వివరించాడు.

➠ జగరాజుపల్లి క్రాస్ వద్ద సుదర్శన్‌రెడ్డితో ముచ్చటిస్తే ఆరు నెలలుగా పండుగల ప్రస్తావనే రాలేదన్నాడు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నెలా ఏదో ఒక పథకం రూపంలో బటన్ నొక్కి నగదు జమ చేసేవారని గుర్తు చేసుకున్నాడు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నాడు. అందుకే ప్రజల చేతిలో డబ్బు ఆడటం లేదని చెప్పాడు. బీడుపల్లి చుట్టుపక్కల ప్రజలను విచారించగా ప్రభుత్వ పథకాలు అందలేదని తెలిపారు. కరెంటు బిల్లులు వివిధ చార్జీల రూపంలో మోత మోగుతుండడంతో వాటిని కట్టేందుకే ఆపసోపాలు పడుతున్నామని కేశప్ప అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. 'గతంలో రైతు భరోసా కింద అందించే సాయంతో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసేవాళ్లం. ఇప్పుడు అలాంటి పథకం అమలు చేయలేదు. బయట అప్పులు పుట్టక పోవడంతో చేసేదిలేక కూలి పనులకు వెళ్తున్నా'మని తెలిపాడు.

➠ జగరాజుపల్లిలో మరికొంతమంది మహిళలు, పెద్దవారిని బాగున్నారా.. పండుగ ఎలా చేస్తున్నారని అడగ్గా.. 'చేతిలో చిల్లి గవ్వ లేదు నాయనా.. తిండికే కరువొచ్చింది. పండుగ ఎలా చేయమంటావ్?' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రంగులు కొనేందుకు సైతం డబ్బుల్లేవన్నారు. ముగ్గులు వేసి.. గొబ్బెమ్మలను పెట్టి.. అలా కానిచ్చేస్తాం.. ఏం చేద్దాం మరి అని నిట్టూర్చారు. ఇలా ఈ ఒక్క ఊరిలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ఇలాంటి దుస్థితే.



వెలవెలబోతున్న జగరాజుపల్లి ప్రధాన కూడలి

పాత రోజులే బాగుండేవి



మా చిన్నప్పుడు సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉండేది. ప్రస్తుతం అలాంటి ఆనవాళ్లు కనిపించడం లేదు. ట్రెండ్ మారినా.. పండుగ చేయడం ఆనవాయితీగా మారింది. అయితే ఈసారి పండుగ సందడి కరువైంది. పదిమందికి అన్నం పెట్టే రైతు.. కూలి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి రావడమే దురదృష్టకరం. ఎవరిని అడిగినా.. ధరలు విపరీతంగా పెరడగంతో సరుకులు కొనలేని పరిస్థితి నెలకొందని సమాధానం చెబుతున్నారు.

– ఓబుళరెడ్డి, జగరాజుపల్లి

బంధువులను పిలవలేదు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేశారు. ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలతో లెక్కలేనన్ని పండుగలు తీసుకొచ్చారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ధరలు పెంచి ప్రజల జేబులకు చిల్లు పెడుతోంది. ఫలితంగా గ్రామంలో ఎక్కడా సంక్రాంతి సందడి లేదు. బంధువులను పిలవడానికే రైతులు జంకుతున్నారు.

– మల్లిరెడ్డి, జగరాజుపల్లి

ఏవీ ఆ రోజులు?



మా రోజుల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా అనపకాయలు తినేవాళ్లం. రేగుపండ్లు తలపై పెట్టుకుని స్నానం చేయడం సంప్రదాయంగా భావించేవాళ్లం. అయితే ఇప్పుడు ఆ రోజులు కనిపించడం లేదు. అనపకాయలు కిలో రూ.200 పైగా ఉన్నాయి. ఏదీ కొనలేం.. తినలేం అన్నట్లు అయిపోయింది పరిస్థితి.

– ఆర్.సూర్యనారాయణరెడ్డి, విశ్రాంత ఎంపీడీఓ, జగరాజుపల్లి

జీవనం దుర్భరమైంది



గడిచిన ఐదేళ్ల పాటు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేయూత పథకం కింద కింద ఒక్కో మహిళకు ఏటా రూ.18,750 అందేది. అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్క పథకం కూడా ఇవ్వలేదు. సంపాదించిన డబ్బు కరెంటు బిల్లులు, స్కూల్ ఫీజులకే సరిపోతోంది. పండుగను ఆర్భాటంగా చేయడానికి ఏమీలేదు. రెక్కాడితేనే డొక్కాడుతుంది. జీవనం దుర్భరంగా మారింది.

– నాగలక్ష్మి, జగరాజుపల్లి

సందడి లేదు



ప్రభుత్వ పథకాలు లేక.. పండుగలు చేయలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామంలో గతంలో ఐదు రోజులపాటు పండుగ సంబరాలు కనిపించేవి. బంధువులు వచ్చేవారు. అయితే ఈసారి ఆ సందడి కనిపించలేదు. ఉన్న డబ్బులన్నీ కరెంటు బిల్లులు, పొలాల్లో పెట్టుబడులు, స్కూల్ ఫీజులకే సరిపోతున్నాయి. రైతులను ఆదుకుంటే పండుగలు, సంప్రదాయాలను కొనసాగించగలం.

– బ్రహ్మయ్య, బీడుపల్లి

సాధారణ వంటలతోనే సరి



సంక్రాంతి పండుగ వచ్చినా ఎలాంటి ప్రత్యేకతా లేదు. సాధారణ వంటలతోనే సరిపెట్టుకుంటున్నాం. సరుకులు తెచ్చుకుందామంటే ధరలు విపరీతంగా పెరిగాయి. కూలి డబ్బులు కాస్తా పిల్లల స్కూల్ ఫీజులు, కరెంటు బిల్లు కట్టేశాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలూ రావడం లేదు. గతంలో వైఎస్ జగన్ ఐదేళ్ల పాటు పథకాలతో ఆదుకున్నాడు.

– రామాంజినమ్మబాయి, బీడుపల్లి తండా

రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు

- 'హంద్రీనీవా' లైనింగ్ టెండర్లు వెంటనే ఆపాలి
- లేకుంటే అన్నదాతలతో కలిసి ఉద్యమిస్తాం
- 'రాప్తాడు' వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


అనంతపురం కార్పొరేషన్: రైతుల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాలను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా లైనింగ్ పనుల టెండర్లను తక్షణం ఆపాలని, లేని పక్షంలో అన్నదాతలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలతో జిల్లా రైతాంగానికి తీరని నష్టం తప్పదన్నారు. జిల్లా ప్రజల కడుపు కొడుతూ తన సొంత నియోజకవర్గమైన కుప్పానికి నీరు తీసుకెళ్లేందుకే చంద్రబాబు లైనింగ్ పనులకు శ్రీకారం చుడుతున్నారన్నారు. లైనింగ్ కారణంగా హంద్రీనీవా ఎగువ, దిగువ దాదాపు 10 కిలోమీటర్ల లోపు భూగర్భ జలాలు అడుగంటి పోతాయని, ఐదు లక్షల ఎకరాల్లో వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. లక్ష మంది రైతులు భూములు అమ్ముకుని వలసలు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తుతుందన్నారు. సీఎం చంద్రబాబుకు రాజకీయాలు తప్ప జిల్లా ప్రజల ప్రయోజనాలు పట్టడం లేదన్నారు.

గొప్ప సంకల్పంతో జగన్ నిర్ణయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని 6,300 క్యూసెక్కులకు పెంచి, లైనింగ్ చేయాలని జీఓ విడుదల చేసిన విషయాన్ని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గుర్తు చేశారు. వెనుకబడిన ప్రాంతాలైన చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లా ప్రజలకు నీరివ్వాలనే గొప్ప సంకల్పంతో చర్యలు తీసుకున్నారన్నారు. గాజులదిన్నెకు 3 టీఎంసీలు, పేరూరుకు 1 టీఎంసీ, శింగనమల చెరువుకు 1 టీఎంసీ, డోన్ నియోజకవర్గంలో 2 టీఎంసీలతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో చెరువులు నింపే కార్యక్రమం, భైరవానితిప్ప ప్రాజెక్ట్‌కు దాదాపు 3.5 టీఎంసీలు, జీడీపల్లి అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్, తోపుదుర్తి రిజర్వాయర్ తదితర నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కానీ, నేడు చంద్రబాబు చంద్రబాబు 3,800 క్యూసెక్కులకు తీసుకువచ్చి అనంతపురం జిల్లాను తిరోగమనం వైపు మళ్లిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు విజ్ఞతతో ఆలోచించి చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. కాలువ వెడల్పు చేసిన తర్వాతే లైనింగ్ చేసేలా మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ చొరవ చూపాలన్నారు. అనంతరం నూతనంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో వివిధ పోస్టుల్లో నియమితులైన నాయకులు రాప్తాడు నియోజకవర్గం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ చంద్ర, పార్టీ రూరల్ మండల కన్వీనర్లు గోవింద్ రెడ్డి, బండి పవన్, రాప్తాడు కన్వీనర్ సాకే వెంకటేశులు, కార్యనిర్వహణ కార్యదర్శి నీరుగంటి నారాయణ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, నాయకులు జూటురు శేఖర్, ఈశ్వరయ్య, నిఖిల్ యాదవ్, పూలకుంట భాస్కర్ రెడ్డి, కొడిమి ఆనంద్, తదితులు పాల్గొన్నారు.

ఖాకీ కర్కశం

- యువకుడిపై పోలీసుల అమానుష దాడి



తలకు గాయాన్ని చూపుతున్న ఇమ్రాన్

అనంతపురం: క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే పోలీసు శాఖలో కొందరు దారి తప్పుతున్నారు.విచక్షణారహితంగా ప్రవర్తిస్తూ శాఖ ప్రతిష్టకే మచ్చతెస్తున్నారు. అనంతపురంలో నడి రోడ్డుపై ఓ యువకుడిని పోలీసులు చావబాదిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం ఆర్టీఓ ఆఫీసు సమీపంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇమ్రాన్ నివాసముంటున్నాడు. ఆదివారం తన తల్లికి టిఫిన్ తీసుకురావడానికి ఐరన్ బ్రిడ్జి సమీపంలోని ఓ హోటల్ వద్దకు వెళ్లాడు. తన బైకును బయట పార్కు చేసి టిఫిన్ తీసుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే అతని బైకుపై కూర్చుని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ నారాయణ స్వామి టిఫిన్ చేస్తున్నారు. బయటకు వచ్చిన ఇమ్రాన్... 'ఆర్టీఓ ఆఫీసు సమీపంలో కొత్తగా ఇల్లు కడుతున్నాం. ఇంటి వద్ద కరెంట్ సామాన్లు ఎవరో దొంగిలించారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఆర్టీఓ ఆఫీసు ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందో చెబుతారా?' అని కానిస్టేబుల్ నారాయణ స్వామిని అడిగాడు. అయితే, 'అది మా స్టేషన్ కాదు.. టూ టౌన్ కిందకు వస్తుంది' అని కానిస్టేబుల్ చెప్పారు. ఈ క్రమంలోనే 'ఎలా ఫిర్యాదు చేయాలి సార్' అని ఇమ్రాన్ మరోసారి అడగ్గా.. కానిస్టేబుల్ రెచ్చిపోయాడు. 'రేయ్.. ల..కొడకా.. నేనేదో టెన్షన్‌లో ఉన్నాను. పో' అని దుర్భాషలాడాడు. దీంతో 'నా బండి మీద నుంచి కిందకు దిగండి.. నేను వెళ్లాలి' అని ఇమ్రాన్ అనగా... కానిస్టేబుల్ నారాయణ స్వామి ఆవేశంతో ఊగిపోయి ఇమ్రాన్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న హోంగార్డు దాదాపీర్‌తో కలిసి చితకబాదారు. సెల్‌ఫోన్ లాక్కున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్‌డిగ్రీ ప్రయోగించారు. తనకు అపెండిక్స్ ఆపరేషన్ అయిందని చెప్పినా కడుపుపై కొట్టారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తీవ్రంగా వాంతులయ్యాయని వాపోయాడు. అనంతరం సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

బాధితుడిపైనే కేసు

గాయాలపాలైన ఇమ్రాన్‌పైనే పోలీసులు కేసు నమోదు చేశారు. 'ఎలక్ట్రికల్ సామగ్రి చోరీ జరిగింది. యూనిఫాం తీసేసి ఉద్యోగాలు మానేయండి' అంటూ ఇమ్రాన్ గొడవపడ్డాడని, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్నాడని కేసు కట్టడం గమనార్హం.

సేవతోనే మానవ జీవితానికి సార్థకత



ప్రశాంతి నిలయం: సేవతోనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందన్న సందేశాన్నిస్తూ విద్యార్థులు నిర్వహించిన నాటిక భక్తులను మైమరపింపజేసింది. సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ క్రీడా సాంస్కృతిక సమ్మేళనాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రశాంతి నిలయం విద్యార్థులు 'కారుణ్యామతన్వతే' పేరుతో సందేశాత్మక నాటిక ప్రదర్శించారు. ఇద్దరు వైద్యుల మధ్య ధనార్జన, మానవ సేవ అన్న అంశాలు ఇతివృత్తంగా తీసుకుని చూడచక్కగా ప్రదర్శించారు.

'కారుణ్యామతన్వతే' నాటికలోని ఘట్టాలు





ప్రజా జీవితానికి విఘాతం కలిగిస్తే చర్యలు



హిందూపురంలో రౌడీషీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రత్న

హిందూపురం అర్బన్: సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాత కేసుల్లో నిందితులకు ఎస్పీ రత్న కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం రాత్రి హిందూపురంలో ఆమె పర్యటించారు. రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద రౌడీషీటర్లు, పాత నేరస్తులతో మాట్లాడుతూ ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం పట్టణ స్టేషన్‌ను తనిఖీ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమీక్షించారు. పట్టణ పరిధిలో ఏదో ఒక అలజడి నిత్యం జరుగుతోందని.. ఇకపై పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లు, ముఖ్య కూడళ్లలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూముకుంట చెక్‌పోస్టు తనిఖీ..

రాష్ట్ర సరిహద్దున ఉన్న తూముకుంట చెక్‌పోస్టును ఎస్పీ తనిఖీ చేశారు. అక్రమంగా కర్ణాటక మద్యం తరలి రాకుండా అడ్డుకట్టవేయాలన్నారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్‌బీ ఎస్‌ఐ ప్రదీప్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం



తీవ్రంగా గాయపడిన ప్రశాంత్

బత్తలపల్లి: కారును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు... తాడిపత్రి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన తేజస్వినీ ఆదివారం ఉదయం బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లిలోని తమ బంధువుల ఇంటికని బయలుదేరి వచ్చి బత్తలపల్లిలో బస్సు దిగింది. అప్పటికే వేచి ఉన్న బంధువు ప్రశాంత్... ఆమెను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై డి.చెర్లోపల్లికి బయలుదేరాడు. తంబాపురం క్రాస్ వద్దకు చేరుకోగానే అప్పరాచెరువు నుంచి ఉన్నఫలంగా రోడ్డు మీదకు వచ్చిన కారును ఢీకొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్, తేజస్వినిని స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు అనంతపురానికి తీసుకెళ్లారు. వీరిలో తేజస్వినీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

పుట్టపర్తి టౌన్: ఉద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఉద్యోగుల సమస్యలపై ఏ మాత్రం దృష్టి పెట్టలేదని మండిపడ్డారు. తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి రోజైన హామీలు నెరవేరుస్తారని ఆశతో ఎదురు చూశామన్నారు. అయితే బకాయిల్లో రూ.1.300 కోట్లు మాత్రమే చెల్లిస్తామని ఆర్థిక మంత్రి కేశవ్ చేసిన ప్రకటన చూస్తే ఆశలపై నీళ్లు చల్లినట్లైందన్నారు. ఐఆర్‌ను తక్షణమే ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు దుర్మరణం



బోల్తాపడిన ట్రాక్టర్ ట్రాలీ

నల్లచెరువు: ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిన ఘటనలో ఓ రైతు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్లచెరువు మండలం నల్లజోడువారి పల్లికి చెందిన రైతులు రామచంద్ర (60), నరసింహులు తాము పండించిన వరి ధాన్యం బస్తాలను శనివారం సాయంత్రం ట్రాక్టర్‌లో నల్లచెరువు సమీపంలోని రైస్ మిల్లుకు తీసుకొచ్చారు. వడ్లు ఆడించిన అనంతరం బియ్యం బస్తాలను తిరిగి ట్రాక్టర్‌లో వేసుకుని ఆదివారం వేకువజాము 2 గంటల సమయంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. పాత రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపైకి ప్రయాణిస్తుండగా మదనపల్లి వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో ట్రాలీ బోల్తాపడడంతో బియ్యం బస్తాలపై కూర్చొని ఉన్న రామచంద్ర ఒక్కసారిగా రోడ్డుపై పడ్డాడు. ఘటనలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రైతు నరసింహులు, ట్రాక్టర్ డ్రై వర్ రవి గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు గమనించి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో రైతు నరసింహులు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మక్బూల్‌బాషా తెలిపారు.

ఆర్బీకేలు పాయె..

ఆర్ఎస్కే సేవలూ లేకపాయె

రైతులకు దూరమవుతున్న ప్రభుత్వ సేవలు

- ఆర్ఎస్కేలుగా మార్పు చేసినా ప్రాధాన్యత ఇవ్వని సీఎం చంద్రబాబు
- వైఎస్ జగన్ సర్కార్‌కు మంచి పేరు రాకుండా కూటమి కుట్ర
- గుమ్మం వద్దకే ఎరువులు అందకుండా తగ్గించేసిన ప్రభుత్వం



నాడు: ఆర్బీకే కళకళ



నేడు: ఆర్ఎస్కే వెలవెల

అనంతపురం అగ్రికల్చర్: దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి శ్రీకారం చుట్టిన గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వాటికి అనుబంధంగా రైతు ముంగిటకే ప్రభుత్వ ఫలాలు అందించడానికి వీలుగా పల్లె పల్లెలోనూ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేసింది. వ్యవసాయం, వాటి అనుబంధశాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఎవరికి ఏమి కావాలన్నా సచివాలయాలు, ఆర్బీకేల ద్వారా రైతుల గుమ్మం వద్దకే సేవలు అందజేస్తూ వచ్చింది. విత్తు నుంచి పంట దిగుబడి విక్రయాల వరకూ అడుగడుగునా రైతులకు అండగా పని చేసేలా ఆర్బీకేలను అప్పటి సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దారు. అప్పట్లో ఆర్బీకే వ్యవస్థ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలపై దేశవిదేశాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. అలాంటి ఆర్బీకేలు ఇప్పుడు ప్రాశస్త్యం కోల్పోయాయి. ఏడు నెలల క్రితం రాష్ట్రంలో ఏర్పడిన కూటమి సర్కార్ వైఖరే ఇందుకు కారణమైంది. వైఎస్ జగన్ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే దురాలోచనతో ఆర్బీకేలను పథకం ప్రకారం సీఎం చంద్రబాబు నిర్వీర్యం చేస్తూ వస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

ఆర్ఎస్కేలుగా మార్పు చేసినా..

ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్కే)గా పేరు మార్చిన కూటమి సర్కారు వాటి ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు తగ్గిస్తూ వచ్చింది. ఫలితంగా ఆర్ఎస్కేల్లో కియోస్క్ మిషన్లు పనికిరాకుండా పోతున్న పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో 451, శ్రీసత్యసాయి జిల్లాలో 416 ఆర్ఎస్కేలు పని చేస్తున్నాయి. అంటే ప్రతి పంచాయతీ పరిధిలో ఒక ఆర్ఎస్కేను ఏర్పాటైంది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పాడి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కమ్యూనిటీ హైయింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ)ల కింద ట్రాక్టర్లు, అత్యాధునిక పనిముట్లు, ఈ–క్రాప్, ఈ–కేవైసీ, పంటల ప్రణాళిక, విత్తన ప్రతిపాదనలు, ప్రకృతి వైపరీత్యాలు, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, దాణా, పశువైద్యం... ఇలా అన్ని రకాల సేవలు అందించిన ఒకప్పటి ఆర్బీకేలు...

గత ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు ఇలా	
సంవత్సరం	అమ్మిన ఎరువులు
2020 (3 నెలలు)	512 మెట్రిక్ టన్నులు
2021-22	10,131 మెట్రిక్ టన్నులు
2022-23	11,335 మెట్రిక్ టన్నులు
2023-24	12,179 మెట్రిక్ టన్నులు
2024-25	2,200 మెట్రిక్ టన్నులు

ఆర్ఎస్కేలుగా పేరు మార్చిన తర్వాత నామమాత్రపు సేవలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం ఆర్ఎస్కేల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువుల అమ్మకాలే అందుకు నిదర్శనం. 2020లో మే 30న రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ఆర్బీకేలను జగన్ సర్కారు అందుబాటులోకి తెచ్చింది. ప్రారంభించిన తొలి మూడు నెలల్లోనే ఆర్బీకేల ద్వారా 512 మెట్రిక్ టన్నుల ఎరువులను గ్రామాల్లోని రైతుల ఇంటి ముంగిటకే అందజేశారు. అప్పటి నుంచి ఏటా ఎరువుల అమ్మకాలు బాగా పెరిగాయి. 2023–24 నాటికి ఆర్బీకేల ద్వారా 12,179 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు తీసుకెళ్లారు. దీని వల్ల రైతులకు ఎరువులపై పెట్టుబడి ఖర్చు బాగా తగ్గింది. ఎరువులు కావాలంటే పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి రావడం అనేది శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని. అలాంటిది గ్రామ స్థాయిలోనే అందుబాటులో పెట్టడంతో రైతులకు ఎంతో ఉపశమనం లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పరిస్థితి మారి రైతులకు మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రణాళికలో భాగంగా వివిధ కంపెనీల నుంచి జిల్లాకు ఎరువులు చేరగానే మొదటి ప్రాధాన్యత కింద గత ప్రభుత్వం ఆర్బీకేలకు కేటాయిస్తూ వచ్చింది. ఇపుడు ఆర్ఎస్కేలకు ప్రాధాన్యత ఇవ్వక పోవడం విశేషం. ఈ ఏడాది కేవలం 2,200 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే ఆర్ఎస్కేల ద్వారా అందించడమే ఇందుకు నిదర్శనం.

తపాలా శాఖను పటిష్టం చేయాలి

- ఎఫ్ఎన్‌పీఏ జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ



మాట్లాడుతున్న వాసిరెడ్డి శివాజీ

పుట్టపర్తి టౌన్: తపాలాశాఖను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వ సంస్థగానే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎన్‌పీఏ) జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి శివాజీ డిమాండ్ చేశారు. ఆదివారం పుట్టపర్తిలోని ఓ రెస్టారెంట్‌లో హిందూపురం డివిజన్ తపాలా ఉద్యోగుల 18వ ద్వైపాక్షిక సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ మాట్లాడుతూ... తపాలా వ్యవస్థను పటిష్టం చేసేందుకు సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 1,50 లక్షల పోస్టాఫీసులతో ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ ఉన్న తపాలా శాఖను పటిష్టం చేయకపోగా 105 రీజనల్ కార్యాలయాలను తొలగించడం అర్థరహితమన్నారు. గ్యారెంటర్‌గా ఉన్న రిజిస్టర్ పోస్టు సర్వీసులను, విద్యార్థుల చదువుకు దోహదపడే సేవలు రద్దు చేయడం సబబు కాదన్నారు. తాము ఉద్యోగులు జీతభత్యాలు పెంచాలని కోరడం లేదని, తపాలాశాఖను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మార్చి 11 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, అసిస్టెంట్ సెక్రటరీ డేవిడ్‌రాజు, సర్కిల్ అసిస్టెంట్ సెక్రటరీ రామకృష్ణ కుమార్, హిందూపురం డివిజన్ ప్రెసిడెంట్ మార్కండేయ, సెక్రటరీ భాస్కర్, పెద్ద సంఖ్యలో తపాలా సిబ్బంది పాల్గొన్నారు

సైబర్.. టెర్రర్

- సంక్రాంతి వేళ కానుకలు.. రీచార్జుల పేరుతో వల
- సీఎం కానుక అంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు
- లింక్ నొక్కితే బ్యాంక్ ఖాతాలో నగదు మాయం
- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న నేరస్తులు


న్యూ ఇయర్ రీచార్జ్ ఆఫర్
నూతన సంవత్సరం సందర్భంగా (నారా చంద్రబాబు నాయుడు) ప్రతి ఒక్కరికీ 3 నెలల రీచార్జ్ ₹749 పూర్తిగా ఉచితంగా ఇస్తున్నారు కాబట్టి క్రింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా ఇప్పుడే రీచార్జ్‌ని పొందండి
ఈ ఆఫర్ పరిమిత కాలానికి మాత్రమే |
https://year-2025.blogspot.com/

నారా చంద్రబాబు నాయుడు పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతున్న మెసేజ్

అనంతపురం: 'సంక్రాంతి సందర్భంగా ఖరీదైన చీర బహుమతికి మీరు ఎంపికయ్యారు. మీరు చేయాల్సింది.. మీ పేరు, వివరాలు మాకు పంపడమే'. 'స్నేహితుడు మీకు సరికొత్త రూపంలో సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతున్నారు. నీలిరంగు గీతను క్లిక్ చేయండి ' అంటూ వాట్సాప్ లేదా, ఎస్ఎంఎస్ మెసేజ్ వచ్చిందా.. అయితే జాగ్రత్త, పడాలి. జనమంతా సంక్రాంతి సంబరాల్లో ఉంటే వారికి శుభాకాంక్షలు, ఉచిత కానుకల పేరిట లింక్‌లు పంపి సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధమయ్యారు. అపరిచిత వ్యక్తుల నుంచి అందే మెసేజ్‌ల్లో లింక్‌లు క్లిక్ చేయవద్దని.. ప్రధానంగా 'ఏపీకే' లింక్‌ల జోలికి అసలు వెళ్లరాదంటూ జిల్లా సైబర్ విభాగం హెచ్చరిస్తోంది.

సీఎం చంద్రబాబు కానుక అంటూ...

- 'నూతన సంవత్సరం సందర్భంగా (నారా చంద్రబాబు నాయుడు) ప్రతి ఒక్కరికీ 3 నెలల రీచార్జ్ రూ.749 పూర్తిగా ఉచితంగా ఇస్తున్నారు. కాబట్టి క్రింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా ఇప్పుడే రీచార్జ్‌ని పొందండి. ఈ ఆఫర్ పరిమిత కాలానికి మాత్రమే' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ వైరల్ అవుతోంది. సీఎం చంద్రబాబు పేరు కనిపిస్తుండడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు అత్యుత్సాహం చూపిస్తూ తమతమ వాట్సాప్ గ్రూపుల్లో తెగ వైరల్ చేసేశారు.
- 'సంక్రాంతికి లక్ష్మీదేవి మీ ఇంటికి వస్తోంది. అమ్మ వారి కాయిన్ పంపిస్తాం. రూ.50 మాత్రమే' అంటూ మరో లింక్ కూడా వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది.
- డియర్ కస్టమర్. మీ ఎస్‌బీఐ ఖాతా లావాదేవీలు నిలుపుదల చేశాం. ఖాతా కూడా ఈ రోజు రాత్రి లోపు శాశ్వతంగా బ్లాక్ చేయబడుతుంది. ఖాతాలో ఆధార్ నంబర్ అప్‌డేట్ కాలేదు. వెంటనే ఆధార్ కార్డును బ్యాంక్ ఖాతాతో అప్‌డేట్ చేసుకునేందుకు కింది లింక్‌ను నొక్కండి' అంటూ ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్ పేరుతో ఏపీకే లింక్ వైరల్ అవుతోంది.

ఈ తరహా మెసేజ్‌లన్నీ మోసపూరితమే. పండుగల సందర్భంగా ఏ ఒక్కరూ ఎవరికీ ఉచితంగా కానుకలు ఇవ్వరనే విషయాన్ని గుర్తించుకోవాలని అంటున్నారు సైబర్ నేర విభాగం అధికారులు. మరో వైపు ప్రభుత్వ పథకాల పేర్లు చెప్పి వాటికి మీరు అర్హత సాధించారంటూ మోసం చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. పొరపాటున ఆయా లింక్‌లు క్లిక్ చేసి మోసపోతే తక్షణమే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

యువతకు ఆదర్శం లాయర్ తులసిరెడ్డి

- సంస్మరణ సభలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నిత్యం ప్రజాసేవకు పరితపించిన న్యాయవాది తులసిరెడ్డి నేటితరం యువతకు ఆదర్శమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందిన తులసిరెడ్డి సంతాపసభ ఆదివారం ఎస్కేయూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగింది. సీనియర్ న్యాయవాది బి.నారాయణరెడ్డి, ఆల్ ఇండియా రేడియో అధికారి నాగేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా తులసిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ఎస్కేయూలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసిస్తున్న సమయంలో తులసిరెడ్డి చాలామందికి సుపరిచితుడయ్యారన్నారు. తానులా చదివే సమయంలో సహకారం అందించారని గుర్తు చేశారు. ఆ సమయంలో కొత్తగా అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు ఆశ్రయం కల్పించడమే కాక, వారికి మార్గదర్శిగా ఉంటూ వచ్చారన్నారు. అవివాహితుడిగా ఉంటూ పలువురికి సాయం అందించారన్నారు. విద్యాలయం పరిచయం లేని వారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ బాగా చదువుకోవాలంటూ చెప్పేవారన్నారు. ఆయన ప్రోత్సాహంతో చదువుకున్న అనేకమంది నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. అందరి కోసం నిస్వార్థంతో పని చేసిన తులసిరెడ్డి ఈ రోజు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ ముండ్ల వెంకటశివారెడ్డి మాట్లాడుతూ... సహాయం అనే పదానికి పర్యాయపదం తులసిరెడ్డి అని కొనియాడారు. ఎవరు అడిగినా లేదనకుండా సాయం చేసేవారని గుర్తు చేశారు.

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తులసిరెడ్డిలో ప్రేమ, అభిమానం, ఆప్యాయత ఎక్కువగా ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తి మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. అనంతపురం నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... విశ్వ విద్యాలయంలో వామపక్ష భావజాలం అధికంగా ఉన్న ఆ రోజుల్లోనే ఎస్ఎస్‌యూఐను బలోపేతం చేసిన వ్యక్తి తులసిరెడ్డి అని గుర్తు చేశారు. సీనియర్ న్యాయవాది నారాయణరెడ్డి మాట్లాడుతూ... తులసిరెడ్డి తన జీవితం మొత్తం స్నేహితుల కోసమే ధారపోశారన్నారు. రాయలసీమలో ఎక్కడికి వెళ్లినా ఆయనకు స్నేహితులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి, తులసిరెడ్డి సోదరుడు గంగిరెడ్డి, అదనపు ఎస్పీ శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఐఆర్ఎస్ అధికారి లోకనాథరెడ్డి, రథాంగపాణి రెడ్డి, న్యాయవాది శ్యామ్‌సుందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్కేయూ పూర్వ విద్యార్థులు జగదీశ్వరరెడ్డి, శ్రీనివాసులు, చేనేత జౌళీశాఖ విశ్రాంత డీడీ రామప్ప పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాల దగ్ధం



మంటల్లో కాలుతున్న డ్రిప్ పైపులు

పుట్టపర్తి టౌన్: ఆకతాయిల చేష్టల కారణంగా డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. వివరాలు... కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన రైతు బ్రహ్మనందరెడ్డి తనకున్న 3 ఎకరాల పొలంలో పంటల సాగుకు సూక్ష్మ సేద్యం పరికరాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి డ్రిప్ పరికరాలతో పాటు 40 కట్టల పైపులు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల రైతులు వెంటనే స్పందించి మంటలు ఆదుపు చేశారు.

ఆపన్నహస్తం అందించండి

దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్న ఆ దంపతులిద్దరూ కష్టపడితేనే పూట గడుస్తుంది. లేకపోతే పస్తులతో పూట గడపాల్సిందే. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ నిరుపేద కుటుంబానికి పెద్ద కష్టమే వచ్చి పడింది. శస్త్రచికిత్సకు చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. ఇది తనకల్లు గ్రామానికి చెందిన సరస్వతి దీనస్థితి.

- మూడేళ్లుగా కంటి సమస్యతో బాధపడుతున్న మహిళ
- ఆపరేషన్‌కు రూ.10 లక్షలు అవుతుందన్న వైద్యులు
- దాతలు సాయం చేయాలంటూ వేడుకోలు



బాధితురాలు సరస్వతి

తనకల్లు: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం, సరస్వతి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎలాంటి స్థిరాస్తులు లేని వారు దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం సరస్వతి కుడి కంటి చుట్టూ రక్తం గడ్డ కట్టడం మొదలైంది. వైద్యం చేయించుకోడానికి ఆర్థిక పరిస్థితి సహకరించుకపోవడంతో అలాగే కాలం నెట్టుకు వచ్చింది. ఈ క్రమంలో వ్యాధి తీవ్రత పెరిగి చివరకు కన్ను కిందకు దిగజారుతూ వచ్చింది. తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న ఆమె పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో చేతిలో ఉన్న డబ్బు కాస్త అయిపోయింది. తెలిసిన వ్యక్తులు సూచించిన మేరకు తమిళనాడులోని మధురై ఉన్న ఓ కార్పొరేట్ వైద్యశాలకు ఇటీవల సరస్వతి, ఆమె కుటుంబసభ్యులు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయాలని, లేకపోతే వ్యాధి మెదడుకు వ్యాపించి ప్రాణానికే ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అయితే శస్త్రచికిత్సకు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో సరస్వతి దంపతులకు దిక్కు తోచలేదు. అంత డబ్బు పెట్టి శస్త్రచికిత్స చేయించుకునే స్థోమత తమకు లేదని, దాతలు ఎవరైనా మానవత్వంతో స్పందించి ఆర్థిక సాయం చేసి ఆపరేషన్‌కు సహకరించాలని బాధితురాలు వేడుకుంటోంది. ఆర్థిక సాయం చేయదలిచిన వారు 98497 04789 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా పంపాలని అర్థిస్తోంది.

సారా నిర్మూలనే ధ్యేయం

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

గుత్తి: జిల్లాలో సారా నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. గుత్తి ఎక్సైజ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సారా ఓ పెద్ద సమస్యలా మారిందన్నారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై గ్రామ సభల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. తండా ప్రాంతాల్లో సారా తయారీ, రవాణా, విక్రయాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ క్రమంలో సారా నిర్మూలనకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఎక్సైజ్ చట్టం ప్రకారం కేవలం పాత నేరస్తులనే కాకుండా అనుమానితులను కూడా బైండోవర్ చేసే అవకాశముందన్నారు. అలాగే మద్యం బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో గుత్తి ఎక్సైజ్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ అస్లామ్ బేగ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఓడీచెరువు: స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న చంద్రశేఖర్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం రెడ్డివారిపల్లికి చెందిన చంద్రశేఖర్ నాలుగేళ్ల క్రితం భార్య, పిల్లలను వదిలేసి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం ఓడీచెరువుకు చేరుకుని అద్దె ఇంట్లో ఉంటూ పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి యజమాని అద్దె కోసం వెళ్లి చూడగా అప్పటికే పైకప్పునకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న చంద్రశేఖర్ కనిపించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, చంద్రశేఖర్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

20 తోటల్లో విద్యుత్ మోటార్ కేబుల్ అపహరణ

శింగనమల: మండలంలోని సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, మట్లగొంది గ్రామాల పొలాల్లో రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్‌మోటార్ల కేబుల్‌ను దుండగులు అపహరించుకెళ్లారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. గత రెండు రోజులుగా సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటూ వచ్చింది. దీంతో రైతులు శనివారం పొలాల వైపుగా వెళ్లలేదు. ఆదివారం తెల్లవారుజామున పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో మోటార్లకు చెందిన కేబుల్ వైర్లు కత్తిరించి ఉండడం గమనించారు. ఈ మూడు గ్రామాల్లో 20 తోటల్లో మోటర్ కేబుల్ వైర్లు చోరీ చేసినట్లు బయటపడింది. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేత 'నంద్యాల'



విజేత ట్రోఫీని అందుకుంటున్న నంద్యాల జట్టు క్రీడాకారులు

యాడికి: మండలంలోని రాయలచెరువులో శని, ఆది వారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో నంద్యాల జట్టు విజయం సాధించింది. పోటీల్లో మొత్తం 24 జట్లు తలపడ్డాయి. నంద్యాల–వైజాగ్, ధర్మవరం–గుంటూరు, గుంటూరు–వైజాగ్ జట్ల మధ్య ఉత్కంఠ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై నంద్యాల నంది పైపుల జట్టు గెలుపొందింది. విజేత జట్లను అభినందిస్తూ పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస, కత్తి రమేష్, ఎరువుల అంగడి నూరి నగదు పురస్కారాలు, ట్రోఫీలను అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన బనగానపల్లి జట్టుకు వసీమ్ రాజా, నాల్గో స్థానంలో నిలిచిన రాయలచెరువు జట్టుకు రాజశేఖర్ నగదు పురస్కారాలను అందజేశారు. కాగా, పోటీలు చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. పోటీలను నిర్వాహకులు శంకర్ నాయుడు, రషీద్ షబ్బీర్ బాషా పర్యవేక్షించారు.

అ'పూర్వ' సమ్మేళనం

విశ్రాంత లెక్చరర్ సాయినాథ్‌తో పూర్వ విద్యార్థులు



ధర్మవరం అర్బన్: నాలుగున్నర దశాబ్దాల క్రితం 1976–78లో ధర్మవరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన 30 మంది... ఆదివారం స్థానిక ఓ గెస్ట్‌హౌస్‌లో కలుసుకున్నారు. ధర్మవరంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వచ్చిన విశ్రాంత లెక్చరర్ సాయినాథ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దాసరి వెంకటేషులు, తల్లం నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.